సాయంకాలంబండికి సుందరమ్మ ప్రయాణము చేయవలసిన సన్నాహాలన్నీ నీలకంఠం చకచకా సాగించేశాడు.

"మీరుకూడా రాకూడదండీ!" అంది మాయ తెలియని ఆ మహా సాధ్వి.

"నాకు కోర్టుపని, పొలంపని, ఇంకా చాలా వ్యవహారాలున్నాయి నీ వెళ్లిరా" అన్నాడు.

సుందరమ్మ వెళ్లిపోయింది. నీలకంఠం కుర్చీలో కూచొని చేయబోయే కార్యక్రమం గురించి దీర్ఘాలోచనలో మునిగి పోయాడు. గాలిలో మేడలు కట్టేసుకుంటున్నాడు. 'దాని శిఖా గొయ్యి సత్తెమ్మకళ్లలో ఎంత అకర్షణుంది' అనుకొంటూ తనలో తానే ముసి ముసి నవ్వేసికొంటున్నాడు. ఇంతలో సత్తెమ్మ గాజులు గళ్ళుమనిపిస్తు ప్రవేశించింది.

"అమ్మగోరేరండి బాబూ?" అని అడిగింది.

"అమ్మగా రూరికెళ్లేరు గాని! నీవు ఆ పెరట్లోవున్న అంట్లు తోమేసి వెళ్ళిపో, మళ్లా 7 గంట లయిన తరువాత హొటల్‌నుంచి భోజనం తీ సు కు రావటానికి ఒక్కసారిరా" అంటూ ఆజ్ఞాపించాడా మహనుభావుడు.

సత్తి సరి అని ఊకొట్టి పని చక్కబెట్టుకొనిపోయింది.

ఏడు గంటలయే సరికల్లా సత్తెమ్మ గబ గబా రైలింజనులాగ వచ్చేసింది. కేరియరు పట్టుకొని హొటల్‌కు వెళ్ళింది. హొటల్ నుంచి ఎంతట తిరిగివస్తుందా అని నీలకంఠం గుమ్మంలో పచారుచేస్తున్నాడు. అంతలో సత్తి కేరియర్ తెచ్చి వంటింట్లో పెట్టింది.

"సత్తీ! ఆపక్క కొంచెం పరిచై" అన్నాడు నీలకంఠం.

"ఇవాళ అపని నాకు చెప్పేరేటి బాబు" అంది సత్తి నవ్వుకొంటూ.

"ఇవాళ అమ్మగారు లేరు కాదు అందు చేత అమ్మగారు చేసే పనులన్నీ నివ్వే సర్దుకు పోవాలి"

సత్తెమ్మపక్క పరుస్తోంది.

"ఏమే సత్తీ! మీవాడు ఊళ్ళో కనపడడు" అంటూ అడిగాడు నీలకంఠం.

"పోనీయండి బాబూ ఆ యెదవ సచ్చి నోడూను యిప్పుడెందుకు" అంది సత్తి పెలుసుగాను.

నీలకంఠం ఇంక ఏంటి మాటాడాలో పాలు పోలేదు. ఇటువంటి చిల్లరవిషయాల్లో అనలే అనుభవంలేనివాడు. అందులోనికి గాబరా మనిషి.

వెంటనే వెళ్లి సత్తెమ్మచేయి పట్టుకొన్నాడు.

సత్తి అయ్యగారి ముఖంలోనికి నవ్వుకొంటూ చూసి చక్కగా పఱచిన పక్కమీద ఒక్కసారిగా ఒరిగిపోయింది. మధుర గులాబీనిచూసిన మధుపం ఐపోయాడు నీలకంఠం.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి. రోజూ ఒక్కపూట వచ్చే సత్తి నీలకంఠంగారింటి కిపుడు మూడు పూటలా రావటం ప్రారంభించింది. ఈ విషయం వూరంతా ప్రాకి పోయింది. ఏనోట విన్నా సత్తెమ్మమాటే! సత్తెమ్మంటే సాలూరుతాలూకా కంతటికీ పేరు మోసింది. సత్తెమ్మని తెలియనివారు ఆవూర్లో ఒక రుండరు! మజాకాన యేంటి! అటువంటి సత్తెమ్మ ఇంత అఘాయిత్యానికి పాలుపడిందంటే తెలియకండావుంటుందా. ఉండుండి సుందరమ్మ ఊరినుండి ఊడిపడిందొకనాడు.

"మీనాన్న కెలా వుంది?" అని అడిగాడు నీలకంఠం.

"మానాన్న కేమండి నిక్షేపంలా వున్నాడు. అసలా టెలిగ్రాం వాళ్ళు యివ్వలేదంట. ఈ పని యెవరో మనమీద కిట్టనివారు చేసుంటారు" అంది సుందరమ్మ.

నీలకంఠం మౌనముద్రవహించి ఒండి వాడికి బాడుగయిచ్చి పంపేశాడు.

రెండురోజులు గడిచిపోయాయి. సత్తెమ్మ సంగతి సుందరమ్మ కర్ణరంధ్రాల్లో ప్రవేశించింది. టెలిగ్రాం ఎవరి పన్నాగంవలన వచ్చిందో, పచ్చిననాడు అయ్యగారి ఆనందానికి కారణమేంటో ఆమెకు తెలిసిపోయింది. వెంటనే యింటిలో సుందరమ్మ సమ్మె చేయ నారంభించింది. సుందరమ్మ కనీస కోరికలు సత్తెమ్మను పనినుండి తొలగించటం, ఆ స్థానే మరో కొత్తమనిషిని ప్రవేశపెట్టటం. ఈ కోరికలు నీలకంఠంచే అంగీకరింపబడలేదు. సుందరమ్మ మూడవరోజునుండి సత్యాగ్రహం ప్రారంభించింది. సత్యాగ్రహం ప్రారంభించిన రెండు రోజులకు సత్తెమ్మ నీలకంఠంగారి పనికి రాజీనామా యిచ్చింది. ఆ సత్యాగ్రహులకు బ్రిటిష్‌వాళ్లే బెదిరిపోయారు సత్తెమ్మ నగా యెంత! బీరకాయపీచు.

పోయినపని పోయింది కాని సత్తెమ్మకు సంవత్సరానికి మూడు మాసాల తక్కువలో ఒక పాప చంకకొచ్చింది. ముచ్చాయి మూడు రూపులూ అత్రిపురసంహారుడే.

(ఇది కేవలం కల్పితం)

★

# * పులి అరుపు *

*

రచన: ఎ. వి. శేషాచారి

★

పూర్వము అక్బరు పాదుషా రాజ్య పాలనము చేసేకాలములో తాన్సేను అనే ఒక కుఱ్ఱవాడుండేవాడు. అతడు ఏకసంతగ్రాహి. శ్రావ్యమైన కంఠముతో చిన్న వయసులోనే మనోహరముగా పాటలుపాడి ప్రేక్షకులను ఆనందపరిచేవాడు. తాన్సేన్‌తండ్రి 'లాలూ'కి రోడ్డు ప్రక్కనే ఒక మామిడితోట వుండేది. మామిడి పళ్లకాలములో రోడ్డుమీంచి పోయే ప్రతి బాటసారి మామిడిపళ్ళు కోసుకుని తీసుకుపోయేవాడు. లాలూ ఏవిధంగాను వారి దురాగతాన్ని అరికట్టలేకపోయేవాడు. ఒక్కపండుకూడా ఈతనికి దక్కేదికాదు. ఎలాగైన తన పంటని నిలుపమని తాన్సేను అతడు నియోగించేడు. వాళ్ళని మనము బెదరించి దెబ్బలాడలేము. గాన ఏదేనా ఉపాయముతో వాళ్ళని ఈ తోట దరి దాపులకు రాకుండా చెయ్యాలి అని తాన్సేను నిశ్చయించుకున్నాడు. ఒక నాడు ఒక పులి వారితోటప్రక్కనుంచే అరుచుకుంటూపోయింది. తాన్సేను ఈ అరుపును విన్నాడు. బాటసారులను ఈ అరుపు అరచి బెదరగొడదామని నిశ్చయించుకొని ఏకసంతగ్రాహి గావున పులి అరుపును ఆకర్ణించుకున్నాడు. మరునాడే దానిని అమలులో పెట్టేడు. బాటసారి రాగానే దగ్గరలోనే దాక్కొని పులి అరుపు అరచేవాడు. 'లాలూ'గారితోటలో పులి వుందని అందరూ నమ్మేరు. పులి భయమువల్ల తోటదరిదాపులకే ఎవరూ వచ్చేవారు కాదు. అపూర్వగాయకుడు తాన్సేను ఉపాయముతో మామిడిపండు ఒక్కటిగూడపోకుండా రక్షించాడు.

★